శివార్లన్నీ పట్నంలోకే..

- నేటితో ముగియనున్న పాలకవర్గం పదవీకాలం
- జీహెచ్ఎంసీలో గ్రామాల విలీనం ప్రచారంతో జడ్పీ ఉనికి ప్రశ్నార్థకం
- ఓఆర్ఆర్ లోపలి పురపాలికలు, జీపీలన్నీ బల్దియాలోకే..



సాక్షి, సిటీబ్యూరో: నగర శివారులో ఐదు మండలాలతో ఐదేళ్ల కిందట ఆవిర్భవించిన మేడ్చల్ జిల్లా పరిషత్(జడ్పీ) ఉనికి ప్రశ్నార్థకమైంది. నేటితో జడ్పీ పాలకవర్గం పదవీకాలం ముగియనుంది. ఓఆర్ఆర్ లోపలి నగర శివారు గ్రామాలన్నీ జీహెచ్ఎంసీలో విలీనం కానున్నాయన్న ప్రచారంతో మేడ్చల్ జడ్పీ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. గురువారంతో జిల్లా, మండల పరిషత్ చైర్మన్ల పదవీకాలం ముగియనున్న నేపథ్యాన్ని పురస్కరించుకుని మేడ్చల్ జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని చివరి సారిగా మంగళవారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న మాజీమంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సీహెచ్ మల్లారెడ్డి, జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డితోసహా జడ్పీ సభ్యులంతా .... కొత్త జిల్లాల ఆవిర్భావంలో భాగంగా అతి తక్కువగా ఐదు రూరల్ మండలాల(61 గ్రామ పంచాయతీలు)తో ఏర్పడిన మేడ్చల్ జడ్పీ ఇక మీదట ఉండకపోవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. నగర శివారుల్లో(ఓఆర్ఆర్ లోపలి)ని గ్రామ పంచాయతీలన్నీ జీహెచ్ఎంసీలో విలీనం కావచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆ దిశగా సన్నాహాలు చేస్తోందని, కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు కూడా పేర్కొనటాన్ని పరిశీలిస్తే, మేడ్చల్ జడ్పీ భవిష్యత్‌లో ఉండకపోవచ్చని తెలుస్తోంది.

మేడ్చల్ జిల్లాలో విలీనం కానున్న పంచాయతీలివే...

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఐదు మండలాల పరిధిలోని 61 గ్రామ పంచాయతీల్లో ఓఆర్ఆర్ లోపల కాచవాని సింగారం, కొర్రెముల, ప్రతాప సింగారం, చీర్యాల, గోధుమకుంట, కీసర, రాంపల్లి, తిమ్మాయిపల్లి, యాద్గారపల్లి, గౌడవెల్లి, పూడూరు, బొమ్మరాసిపేట తదితర 12 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇవి కాకుండా ఓఆర్ఆర్‌కు అతి సమీపంలో మరో 10 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. శివారుల్లోని దాదాపు 20 పైగా గ్రామ పంచాయతీలు జీహెచ్ఎంసీలో విలీనం అయితే, మిగిలిన 40 గ్రామ పంచాయతీలతో మేడ్చల్ జిల్లా పరిషత్ కొనసాగించటం సాధ్యం కాకపోవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పురపాలికల విలీనంపైనా చర్చ

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఓఆర్ఆర్ లోపల ఉన్న గ్రామ పంచాయతీలే కాకుండా, పురపాలక సంఘాలు కూడా జీహెచ్ఎంసీలో విలీనం కానున్నట్లు జోరుగా చర్చ సాగుతోంది. కొత్తగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఆవిర్భవించిన తర్వాత నూతనంగా ఏర్పడిన బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్లతోసహా దమ్మాయిగూడ, నాగారం, ఘట్కేసర్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, కొంపల్లి, దుండిగల్, పోచారం పురపాలికలు కూడా జీహెచ్ఎంసీలో విలీనం కావచ్చునన్న ప్రచారం జరుగుతోంది. జిల్లాలో మొత్తంగా 13 పురపాలక సంఘాలు ఉండగా, ఒక మేడ్చల్ మినహాయించి, మిగతా 12 పురపాలక సంఘాలన్నీ గ్రేటర్‌లో కలుస్తాయన్న చర్చ సాగుతోంది.

మండల ,జిల్లా పరిషత్‌ల్లో ఇక ప్రత్యేక పాలనే..!

నగర శివారుల్లోని మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలోని మండల, జిల్లా పరిషత్‌ల పదవీకాలం గురువారం ముగియనుండటంతో ఇక ప్రత్యేక పాలన కొనసాగనున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం మండల, జిల్లా పరిషత్‌లకు స్పెషల్ ఆఫీసర్లను త్వరలో నియమించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. శివారల్లోని ఇద్దరు జడ్పీ చైర్మన్లు ఉండగా, వీరిద్దరు కూడా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో మొత్తంగా 42 మండలాలు(రంగారెడ్డిలో 27, మేడ్చల్‌లో 15 మండలాలు) ఉండగా, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ప్రాతినిధ్యం వహిస్తున్న మండలాలు 26(రంగారెడ్డి 21, మేడ్చల్ 5 మండలాలు) మాత్రమే ఉన్నాయి.

బీసీ జనగణన చేపట్టిన తర్వాతే...

బీసీ కుల జనగణన చేపట్టి ఆ తర్వాత గ్రామ పంచాయతీ, ప్రాదేశిక రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికలు చేపట్టాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. గతంలో ఎన్నికలు జరిగినప్పుడు ప్రకటించిన రిజర్వేషన్లు పదేళ్లపాటు కొనసాగాలని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ చట్టం రూపొందించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో ఏ మేరకు నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిన అవసరముంది. ఈ నేపథ్యంలోనే స్థానిక సంస్థల ఎన్నికల అంశంపై ప్రభుత్వం అక్టోబరు వరకు వేచి చూసే ధోరణితో ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

మేడ్చల్‌ను అగ్రగామిగా నిలిపాం: ఎమ్మెల్యే



ఎంపీటీసీలతో ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: మూడు స్థానికసంస్థల పరిపాలనలతో మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని దేశంలోనే అభివృద్ధిలో అగ్రగామిని చేశామని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పాలకవర్గాన్ని సన్మానించి వీడ్కోలు పలికారు. మేడ్చల్ నియోజకవర్గంలోని స్థానిక సంస్థలకు ఈ పాలకవర్గాలే చివరివి కావచ్చని అన్నారు. శివారు ప్రాంతాలను గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం చేయాలని, మున్సిపల్ కార్పొరేషన్‌లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. మండల పరిషత్ సభ్యుల పదవీకాలం ముగియడంతో ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజవిజయానందారెడ్డి, ఎంపీటీసీలు రఘు, ప్రకాష్, కుమార్‌యాదవ్, అనూప శ్రీకాంత్‌రెడ్డి, హేమలత, ఆశ సుల్తానా, రుక్సానా, అంకితలను సన్మానించారు. సమావేశంలో ఎంపీడీఓ వసంతలక్ష్మి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, నాయకులు దయానంద్ యాదవ్, రాజమల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి: ఎంపీపీ



ఇందిరా లక్ష్మీనారాయణ, సత్తిరెడ్డిలతోపాటు ఎంపీటీసీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

కీసర: ఆందరి సహకారంతో మండలంలోని వివిధ గ్రామాల్లో గత ఐదేళ్లలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపట్టినట్టు కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నేటితో పదవీకాలం ముగియనున్న ఎంపీటీసీ సభ్యుల ఆత్మీయ సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ ఇందిరా లక్ష్మీనారాయణ, జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, ఎంపీడీఓ గ్యామ మాట్లాడారు. అనంతరం ఎంపీపీ ఇందిరా లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ జలాల్‌పురం సత్తిరెడ్డి తోపాటు ఎంపీటీసీ సభ్యులు టి.నారాయణ, మంచాల కిరణ్‌జ్యోతి ప్రవీణ్, కందాడి ప్రమీలా అమరేందర్‌రెడ్డి, జూపల్లి వెంకటేష్, పండుగ కవితాశశికాంత్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కీసర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోల కృష్ణాయాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, మండల వైద్యాధికారి డాక్టర్ సరితారెడ్డి, ఎంఈఓ శశిధర్, మండల వ్యవసాయాధికారి మాధవీలత, సూపరింటెండెంట్ హమీద్, గ్రామకార్యదర్శులు పాల్గొన్నారు.

ఆదర్శజంటకు ఆర్థికసాయం



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: కులాంతర వివాహం చేసుకున్న ఆదర్శ జంటకు ప్రభుత్వం ఆర్థికసాయాన్ని ఎమ్మెల్యే మల్లారెడ్డి అందజేశారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయకు చెందిన మనీషీ, సిద్ధిరామ్ కులాంతర వివాహం చేసుకుని యువతకు ఆదర్శంగా నిలిచారు. దీంతో ఆ దంపతులకు ప్రభుత్వం రూ.రెండున్నర లక్షలను ఎమ్మెల్యే తన నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు దయానంద్ యాదవ్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ భాస్కర్‌యాదవ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మేడ్చల్: పట్టణంలోని కిందిబస్తీ 17వ వార్డులో మున్సిపాలిటీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికానర్సింహారెడ్డి ప్రారంభించారు. కౌన్సిలర్ అర్చన సందీప్‌గౌడ్‌తో కలిసి ఆమె నిర్మాణపనులకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని అన్ని కాలనీలలో సీసీ, బీటీ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ నాగిరెడ్డి, కాలనీలవాసులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్ పర్సన్, కౌన్సిలర్

కబ్జా బారి నుంచి రహదారి స్వాధీనం



రహదారి ఓపెన్ కావడంతో హర్షం వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీ ఎన్‌క్లేవ్‌లో కబ్జాకు గురైన రహదారిని బుధవారం స్థానిక కాలనీవాసులు, కాంగ్రెస్ కౌన్సిలర్ పంబాల సరితారమేష్ సహకారంతో స్వాధీనం చేసుకున్నారు. ఈ 40 అడుగుల రహదారిలో నిర్మించిన తాత్కాలిక ప్రహరీని జేసీబీ సహాయంతో కూల్చివేశారు. బాలాజీ ఎన్‌క్లేవ్‌ను 1983లో ఏర్పాటు చేశారు. అప్పట్లో ప్రధాన రహదారి గుండా వెనకాల ఉన్న లేఔట్లలోకి వెళ్లేందుకు 40 అడుగుల రహదారికి స్థలం వదిలిపెట్టారు. కొన్నేళ్ల క్రితం ఓ వ్యక్తి ఆ రహదారి స్థలానికి డాక్యుమెంట్ తయారు చేసి ఆక్రమించి వాహనాల రాకపోకలు బంద్ చేశారు. ఈ విషయంపై గతంలో పలుమార్లు మున్సిపల్ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అయితే ఇటీవల కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఈ సమస్యపై ఫిర్యాదు చేయగా వెంటనే న్యాయం జరిగిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఈ రహదారి తెరుచుకోవడంతో బాలాజీ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ కాలనీ, రాజ్‌సుఖ్‌నగర్, ఈస్ట్ హనుమాన్‌నగర్, సాయిస్వరూప కాలనీవాసులకు మేలు జరిగిందన్నారు. కాగా, 40 అడుగుల రహదారిలో నిర్మించిన నిర్మాణాలను కూల్చి వేయడంపై కీసర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అయినట్లు సమాచారం.



ప్రహరీని జేసీబీ సహాయంతో తొలగిస్తున్న దృశ్యం

స్పందించి... చేసేది సగం పనులేనా?

మేడ్చల్‌రూరల్: మేడ్చల్-కిష్టాపూర్ రోడ్డులోని వాగు సమీపంలో రోడ్డు మరమ్మతుల కోసం రోడ్డును తవ్వి అర్ధాంతరంగా వదిలేయడంతో ఈ నెల గత నెల 20న 'తవ్వి... ఇలా నిర్లక్ష్యంగా వదిలేశారు'అనే శీర్షికతో సాక్షి కథనం ప్రచురించింది. దీంతో స్పందించిన అధికారులు మరమ్మతు పనులను వారం క్రితం మొదలుపెట్టడంతో సమస్య తీరిందని వాహనదారులు భావించారు. కానీ, అధికారులు సగం పనులు చేసి మమ అనిపించడంతో ఇబ్బందులు తప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో సీసీ రోడ్డు పనుల్లో మిగిలిన మెటీరియల్‌ను ఇక్కడికి తీసుకువచ్చి సగం పనులు చేశారు. మిగతా సగం పనులు వేరే కాలనీల్లో రోడ్డు వేసినప్పుడు కాంక్రీట్ మెటీరియల్ మిగిలితేనే వేస్తారా అంటూ వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. సగం రోడ్డు కారణంగా వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి పనులు చేపట్టాలని కోరుతున్నారు.



నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్ రూరల్: 44వ జాతీయ రహదారి విస్తరణ పనుల కారణంగా గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ వెంకట్‌గౌడ్ తెలిపారు. రోడ్డు పనుల కారణంగా బాలగాని, మేరు ఆస్పత్రి ప్రాంతాలతోపాటు అంథం విల్లాస్, మైపీ గ్రీన్ విల్లాస్, అపర్ణ, కేవీరెడ్డి నగర్ కాలనీ ప్రాంతాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పేర్కొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు



మేడ్చల్‌రూరల్: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు బుధవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. ×ఏక్ పేడ్ మా కే నామ్´పేరిట తల్లుల గౌరవార్థం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్, కౌన్సిలర్లు మల్లిఖార్జున్ ముదిరాజ్, అమరం సరస్వతి, నాయకులు కృష్ణగౌడ్, రవీందర్‌గౌడ్, కిషన్, నాగరాజు, సురేశ్, నవనీత, శ్రీధర్, మహేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు అండగా నిలవాలని తహసీల్దార్‌కు వినతి

ఘట్‌కేసర్: చౌదరిగూడ సర్వే నంబర్ 869లోని వీకర్‌సెక్షన్ కాలనీకి చెందిన పేదలకు అండగా నిలవాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వినోద్, తహసీల్దార్ రజనికి బుధవారం వినతిపత్రం అందజేశారు. 1996లో అప్పటి ప్రభుత్వం 183 మంది పేదలకు పట్టాలిచ్చిందని, అందులో చాలామంది ఇళ్లు నిర్మించుకుని పన్నులు కూడా చెల్లిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. యాదయ్య అనే వ్యక్తి తమకు ప్రభుత్వం భూమి కేటాయించిందని తెలుపుతూ కోర్టుకెక్కి పోలీసులు, రెవెన్యూ అధికారులు సంఘటనాస్థలానికి రాకుండా ఆర్డర్ తెచ్చుకున్నాడని తెలిపారు. అయితే పట్టాలు పొందిన వారి తరఫున తహసీల్దార్ నేటికీ ఎటువంటి చాలెంజ్ చేయలేదన్నారు. పేదలకు అధికారులు అండగా నిలబడి స్థలాలను క్రమబద్ధీకరించాలని కోరారు.

మాజీ ఎంపీటీసీ హత్యకేసును నీరుగారుస్తున్నారు...

ఘట్‌కేసర్: మాజీ ఎంపీటీసీ మహేశ్ హత్య కేసును పోలీసులు నీరుగారుస్తున్నారని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. మహేశ్ కుటుంబ సభ్యులు పట్టణంలోని బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మృతుడి తల్లి మైసమ్మ, సోదరుడు విఠల్ మాట్లాడుతూ రాజకీయంగా ఎదుగుతున్న మహేశ్‌ను అడ్డు తొలగించడానికి ఓ కౌన్సిలర్ కుట్ర చేశాడని ఆరోపించారు. ఫిర్యాదు చేసిన వారిని వదిలిపెట్టారని, నిందితుల వివరాలు ప్రకటించకుండా రిమాండ్‌కు తరలించారన్నారు. న్యాయం లభించని పక్షంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.



సేవలతోనే నాయకులకు గుర్తింపు: ఎమ్మెల్యే



ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్: నాయకులు ప్రజలకు అందించిన సేవలే గుర్తింపును తెస్తాయని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యలయంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులను బుధవారం సత్కరించి వీడ్కోలు పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ×సుదర్శన్‌రెడ్డిని ఎంపీపీగా చేస్తే మేడ్చల్ ఎమ్మెల్యేగా నా మీదనే పోటీ చేశాడు´అని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతారెడ్డి, ఎంపీఓ రవి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, వైస్ ఎంపీపీ జంగమ్మ, ఎంపీటీసీలు సరళ, శోభారాణి, సరళ, వెంకట్రాంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామారావు ముదిరాజ్, రవి, కోఆప్షన్ సభ్యుడు ఎక్బాల్, మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్ ఆంజనేయులుగౌడ్, వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ సంజీవరెడ్డి, ధర్మారెడ్డి, మాజీ సర్పంచులు కావేరి, వెంకటేశ్, మంగమ్మ, శివశంకర్, యాదగిరి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ఘట్‌కేసర్: మండలంలోని ఘనాపూర్ పకీర్ టిక్యా, కొర్రెముల్, వెంకటాపూర్, కాచవాని సింగారం, ప్రతాప సింగారం, మున్సిపాలిటీలోని ఎస్ఎఫ్‌సీ నగర్‌లో జిల్లా పరిషత్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పైపులైన్, డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు, అంగన్‌వాడీ భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జంగమ్మ, ఎంపీడీఓ గీతారెడ్డి, కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మండల అధ్యక్షుడు రాజేశ్, కౌన్సిలర్లు సంగీత, రమాదేవి, ఆంజనేయులుగౌడ్, వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్ ప్రభాకర్‌రెడ్డి, అంజిరెడ్డి, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష ప్రధానకార్యదర్శి ముత్యాలు యాదవ్, రాధాకృష్ణ ముదిరాజ్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్‌సీనగర్‌లో అంగన్‌వాడీ భవనం ప్రారంభిస్తున్న శరత్‌చంద్రారెడ్డి

కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల ధర్నా



డీఆర్ఓ హరిప్రియకు వినతిపత్రం అందజేస్తున్న వికలాంగుల హక్కుల నేతలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం వృద్ధులు, వితంతువులకు ఆసరా పింఛన్ రూ. 4 వేలు, వికలాంగులకు రూ. 6 వేలకు పెంచి పంపిణీ చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకట్ డిమాండ్ చేశారు.

ఏడు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం పింఛన్ల పెంపు కోసం తీసుకున్న చర్యలు ఏమి లేవని విమర్శించారు. వికలాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాక్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు. ప్రతీనెల 5 లోపే పింఛన్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న మహిళా శక్తి క్యాంటీన్లో వికలాంగులకు ఐదు శాతం కేటాయించాలన్నారు. తీవ్ర వైకల్యం కలిగిన వికలాంగులకు ప్రత్యేక అలవెన్స్‌ను అందించే ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తన వాటా కింద రాష్ట్ర ప్రభుత్వాలకు అందించే వికలాంగుల పింఛన్ రూ.300 నుంచి రూ.3 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డీఆర్ఓ హరిప్రియకు రాష్ట్ర , జిల్లా నేతలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించారు. ఈ ధర్నాలో జిల్లా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు చంద్రమోహన్, లక్ష్మీపతి, మల్లేష్, విజయ లక్ష్మి,రమేష్, షైన్ బేగం, నవ్యా, భాను, బ్రహ్మయ్య కోటయ్య మన్నాన్ ,చంద్రయ్య, సుల్తాన్ రమేష్,గంగారెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన ఎంపీపీ, ఎంటీసీలు



కేసీఆర్‌ను కలిసిన మేడ్చల్ మండల పరిషత్ పాలకవర్గం

మేడ్చల్: మేడ్చల్‌కు చెందిన బీఆర్ఎస్ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు తమ పదవీకాలం ముగియడంతో మాజీ సీఎం కేసీఆర్‌ను కలిశారు. బుధవారం మండల పరిషత్ సమావేశం ముగియగానే ఎంపీటీసీలు ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్‌కు తరలివెళ్లారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎన్నికయ్యే అవకాశం కల్పించడంతో కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, ఎంపీటీసీలు, మేడ్చల్ కౌన్సిలర్ ఉమా నాగరాజు, నాయకులు భాస్కర్ యాదవ్, దయానంద్ యాదవ్, సుదర్శన్, రఘుపతిరెడ్డి, సురేష్‌రెడ్డి, యూనస్ పాషా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మహిళాభవనం భూమిపూజలో శరత్‌చంద్రారెడ్డి తదితరులు

కీసర: జిల్లా పరిషత్ నిధులను వెచ్చించి పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపట్టినట్లు జిల్లా పరిషత్ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి అన్నారు. కీసర, గోధుమకుంట, రాంపల్లిదాయర గ్రామాల్లో రూ.30 లక్షల జిల్లా పరిషత్ నిధులతో నిర్మించనున్న మహిళాభవనాలకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జె.సత్తిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు టి.నారాయణ, మంచాల కిరణ్‌జ్యోతి ప్రవీణ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోల కృష్ణాయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి, నేతలు వంగేటి పర్వత్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, జంగయ్యయాదవ్, ముత్యాలు, మహేష్, కృష్ణారెడ్డి, రామిడి స్వప్నావిజయ్‌రెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీలకు సన్మానం



ఎంపీటీసీ సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

శామీర్‌పేట: శామీర్‌పేట మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఎల్లుబాయి బాబు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఎంపీటీసీ సభ్యుల నుద్దేశించి మాట్లాడారు. అనంతరం ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం ముగియడంతో వారిని ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అనితలాలయ్య, ఎంపీటీసీ లు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

అటెండర్‌కు వీడ్కోలు



మల్లేష్‌ను సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ పద్మాజగన్‌రెడ్డి దంపతులు

మేడ్చల్: సుదీర్ఘ కాలం మండల పరిషత్ కార్యాలయంలో పని చేసి ఉద్యోగ విరమణ చేసిన అటెండర్ మల్లేష్‌ను ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, మాజీ ఎంపీపీ పద్మాజగన్‌రెడ్డి దంపతులు బుధవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. మల్లేష్‌కు పద్మాజగన్‌రెడ్డి బంగారం అందజేసి తన అభిమానం చాటుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి కృషి చేస్తున్నాం

రైతు సేవా సహకార సంఘం చైర్మన్ రాంరెడ్డి

ఘట్‌కేసర్: రైతుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని రైతు సేవా సహకార సంఘం చైర్మన్ రాంరెడ్డి అన్నారు. పట్టణంలోని బంధన్ ఫంక్షన్ హాలులో బుధవారం నిర్వంహించిన సమావేశంలో రైతు బంధుపై రైతుల అభిప్రాయం సేకరించారు. రైతులు సాగు చేస్తున్న భూమికే రైతుబంధు అమలు చేయాలని, వరికే కాకుండ జొన్న, వర్షాధార పంటలకు కూడా రైతుబంధు అమలు చేయాలని పలువురు రైతులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ రుణ మాఫీ, సాగుపెట్టుబడి అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి రాజేందర్‌రెడ్డి, ఎండీ కరుణాకర్, సంఘం వైస్ చైర్మన్ అనంతరెడ్డి, డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, ధర్మారెడ్డి, ప్రవంతి కృష్ణారెడ్డి, పోచిరెడ్డి, మహేందర్, రామకృష్ణారెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, వెంకటేశ్, రమేశ్, లక్ష్మమ్మ, మేనేజర్ ప్రకాశ్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు

ఘట్‌కేసర్: ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించిన వారిపై ఘట్‌కేసర్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ సైదులు తెలిపిన వివరాలు... పట్టణానికి చెందిన దయాల లక్ష్మమ్మ ఘట్‌కేసర్ సర్వే నంబర్‌లోని 102లోని భూమిని తన కుమారుడు, కూతురికి గిఫ్ట్‌డీడ్ చేయడానికి బుధవారం మూడు స్లాట్‌లు బుక్ చేసింది. కానీ, దయ్యాల అంజయ్య అనే వ్యక్తి భూమిపై పిటిషన్ ఉందని, ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయకూడదని గత నెల 11న ఫిర్యాదు చేశాడు. అయితే అతడు ఎటువంటి ఆర్డర్ పత్రాలు జతచేయలేదు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు పెట్రోల్ బాటిల్‌తో ఐదారు మంది మహిళలతో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి శరీరంపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించారు. దీంతో ప్రాణభయంతో కార్యాలయం సిబ్బంది గదిలో దాక్కున్నారు. కార్యాలయంలోకి ప్రవేశించి విధులకు ఆటంకం కలిగించినట్లు తహసీల్దార్ రజని పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు పోలీసులు అంజయ్యతో పాటు పలువురిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భూమిపూజ

పోచారం: అన్నోజిగూడలోని అంగన్వాడీ కేంద్రానికి ప్రహరీ నిర్మించేందుకు జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రహరీ నిర్మాణానికి రూ. 2.5 లక్షల నిధులు కేటాయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్, పలువురు కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.